# అబలచేసిన ఉపకారం

సూరిబాబుకు ఏదో చప్పున మెదడులో మెరిసింది. గోళ్లు గిల్లుకుంటూ ఎన్నాళ్ళు యీ విధంగా గడుపుతావు, అని యెంతమంది చెప్పినా, వినని సూరిబాబుకు యీనాడు ఓ ఫ్యాన్సీ షాపు పెట్టాలని హఠాత్తుగా బుద్ధిపుట్టటం ఆశ్చర్యంగానేవుంది. తన జీవితం మీద తనకే ఓ విధమైన రోత పుట్టేటప్పటికి యిలాంటి బుద్ధి కలిగిందేమో అని అనుకున్నాడు. కాకపోతే మగవాడయిన తర్వాత ఏ ఏపా లేకండా, యితరుల శ్రిమఫలితాన్ని అనుభవించే ఓ ఉసులు పాటు వుందిగదా అని యింటిపట్టున యెన్నాళ్లని వుండగలుగుతాడు కనక! కొంతమంది అనుకోవటమేమో, రైతులు బకాయి పెట్టినప్పటి నుంచి, సూరిబాబు, భవిష్యత్తును గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నాడని, ఆ ఆలోచన ఫలితమే చివరకు యీవిధంగా పరిణమించిందని. ఎట్లాగైతేనేం ఓదారికి వచ్చి, తాను సంపాదించాలనే జ్ఞానం కలిగితే అంతకంటే లేనిదేముంది అని భార్య సంతోషపడింది.

చిల్లర మల్లరకు వెదుక్కునే అవసరం లేని సూరిబాబుకు ఫ్యాన్సీ షాపు పెట్టాలంటే, పదివేలరూపాయలు కనీసం కావాలసి వస్తుందనే మాట తట్టక కాదు. వెంటనే బ్యాంకులో డబ్బూ, యింకా పొలం అమ్మిన బాపతుడబ్బూ చేర్చి, పేటలో ఓ ఫ్యాన్సిషాపును పెద్ద ఆడంబరం యేమీ లేకండానే తెరిచేశాడు. ఈ షాపు పెట్టటంతో తన దిన

చర్యలో పూర్తిగా మార్పు వచ్చేసింది. ఇప్పుడు ఎనిమిది గంటలకు బద్ధకంగా, మడత మంచంమీద నుంచే కాఫీ అయిందిటే అంటూ కేకలు పెట్టటానికి వీల్లేదు. అసలు తొమ్మిది గంటలకే షాపుతెరవాలి! చీటికి మాటికి పెళ్లాంతో పోట్లాడటానికి అంతకంటె సావకాశంలేదు. ఎప్పటి కప్పుడు ఒక్కొక్క వస్తువు ధరెంతో, మార్కెటు రేటెంతో యిదే ఆలోచనేను! పిల్లలతో గిల్లి కయ్యం పెట్టుకోవటానికి అంతకంటె తీరు బడిలేదు. తల్లిని తిట్టటానికి సమయమే దొరకటంలేదు. అందు వలన క్రమక్రమేణా ఆ అవసరం కూడా తీరిపోయింది. ఆమెగారి పొలం వ్రాసి ఇవ్వమని అడగటానికి, తన వ్యక్తిత్వం అడ్డువచ్చేస్తోంది. దాంతో, తల్లితో తగాదేలేదు. కొడుకు ప్రయోజకుడు అవుతున్నాడని తల్లి సంతోషించింది. మొగుడు సంపాదనా పరుడవుతున్నాడని భార్య గౌరవిస్తోంది. పిల్లలేమో యిప్పుడిప్పుడే నాన్నంటే లక్ష్యంగా వుంటు న్నారు. ఇది చెయ్యద్దు అంటే, నా యిష్టం నేను చేస్తాను అనే మధు కూడా, అట్లాగే నాన్నా అంటూ చతికిలపడి పోతున్నాడు. నానుడుగా పని చేసే భార్యకూడా అతిచురుకుగా పనులు చేసుకుపోతోంది. సూరిబాబు ఆరింటికి లేచేటప్పటికి, బాయిలర్‌లో నీళ్ల సలసల కాగి ఉంటాయి. మంచం దగ్గరకే, టూత్‌పేస్టు, బ్రష్, చెంబుతో నీళ్లు తయారవుతాయి. ఏ ఇడ్డెన్లో, పెసరట్లో, చేసి పెట్టి పంపుతుంది భర్తను షాపుకు. మళ్ళీ మధ్యాహ్నం వేళకు, మధు అన్నం తీసుకొస్తాడు. ఎండలు తక్కు వగా వుంటే, సూరిబాబే యింటికివచ్చి అన్నం తినిపోతూవుంటాడు. తాను వచ్చేటంత వరకు వసంత, కళ్ళు పెట్టుకుని కూర్చుని వుంటే, సూరిబాబుకు, తాను అన్నం పెట్టుకుని తిన్నరోజులు జ్ఞాపకానికి వస్తూ వుంటాయి. సూరిబాబు, అమ్మా అని తల్లిని పిలుస్తూవుంటే, శాంతమ్మకు, కొడుకుమీదకొచ్చి, కొట్టినరోజులు జ్ఞాపకానికి వస్తూవుంటాయి.

సంపాదన ప్రారంభించినప్పటినుంచి, సూరిబాబుకు డబ్బు విలువ తెలియటం మొదలుపెట్టింది. అందువలనే యిప్పుడిప్పుడే పొదుపుగా వాడుకోవటం యేమిటో తెలుస్తోంది. ఇంట్లో, తాను ఏ విషయం లోనూ కూడా జోక్యం కలుగచేసుకోవలసిన అవసరం యేమీ కనిపించ టంలేదు. చుట్టు పక్కల చిన్నషాపుల్లో లేని వస్తువులను కని పెట్టి, సూరిబాబు ఉపాయంగా వాటన్నింటిని తెప్పించి పెట్టాడు. ముందుగా, వ్యాపారం వృద్ధిపొందటానికి, ధరలు కూడా మార్కెట్టు ధరలకంటే, కొద్దిగా తగ్గించే వుంచాడు. దాంతో సూరిబాబు వ్యాపారం బాగా వృద్ధి పొందుతూనేవుంది. సూరిబాబుకు అదివరకున్న అభిప్రాయాలు యెన్నో మారిపోయినాయి. అసలు జీవిత గమనమే మార్పు పొందింది. సంఘంలో అంటే తన చుట్టూవుండి, తనను అదివరకల్లా ఎద్దేవాచేసి తనను ఒక అసమర్థునిగా యెంచిన జనసమూహంలో, తనకు యీనాడు ఒక మంచిస్థానం యేర్పడింది. నలుగురూ కూడా సూరిబాబుగారు అంటూ ఎంతో యిదిగా మాట్లాడుతూ వుంటారు. తనను యీ విధంగా నలుగురూ యెందుకు చూస్తున్నారా అని తీవ్రంగా ఆలోచించే అవసరం కాని, అవకాశంకాని లేకపోయినా, అయిదో ఫారం తప్పిన తనకు, యీనాడు యింత గౌరవం లభించటానికి కారణం, తాను ఒక పెద్ద ఉద్యోగం చేస్తున్నాడనికాదు, ఒక పెద్ద ఫ్యాన్సీ షాపుకు అధిపతి గనక అని సూరిబాబు మనస్సులో అనుకున్నాడు.

తనకు వెంటనే ఏదో ఆలోచనగా వచ్చింది. వీళ్లందరి దగ్గర కూడా వ్యాపార లక్షణాలే ప్రదర్శించాలని. నిర్మొహమాటంగా వుండాలని. లేకపోతే వ్యాపారం దెబ్బతింటుందని, నయాపైసా దగ్గర్నుంచి లెక్కలు వ్రాయటం, షాపు పెట్టినప్పటినుంచి అలవాటు చేసుకున్నాడు. దుబారా ఖర్చంటూ ఏమీ పెట్టటంలేదు. మరీ అవసర

మైతేతప్ప, లేకపోతే, రోజూ సత్యనారాయణపురంనుంచి, షాపుకు నడిచి వెళ్ళాలిసిందే, నడిచి రావాలిసిందే! కాఫీ, ఫలహారం యింటి దగ్గర తీసుకున్న తర్వాత, మళ్ళీ భోజనం వేళవరకు హోటలులో కాఫీకూడా త్రాగటానికి మనస్సు వప్పటంలేదు. ఓనాడుగామాలు, అన్నం తీసుకురావటం, ఆలస్యం అయేటప్పటికి, కాఫీత్రాగాడు. ఆ రోజంతా అనవసరంగా ఖర్చయిందే అని యెంతో బాధపడ్డాడుకూడ. రోజు రోజుకు ప్రజలకు అవసరాలు యెక్కువవుతున్న కొద్దీ, సూరిబాబు వ్యాపారం అభివృద్ధి పొందుతూనే వుంది, జీవితంలో షోకులకు, పైపై పూతలకు స్థానం ఎక్కువవుతున్నకొద్దీ, సూరిబాబు మనస్సులో సంతోష పడుతున్నాడు. మెల్లిమెల్లిగా షాపులో మంచి మంచి సిల్కు చీరెలు, కూడా పెట్టటం మొదలు పెట్టాడు సూరిబాబు. షాపు పెరుగుతున్నకొద్దీ, ప్రక్కవాటా కూడా తీసుకొన్నాడు.

ఎప్పుడో షాపు తెరిచిన క్రొత్తలో, మధు, సుజాతల్ని తీసుకు వెళ్ళి చూపించాడు. తర్వాత ఎన్నిసార్లు ఉబలాటపడినా, అదిగో యిదిగో అంటూ సూరిబాబు దాటేస్తూనే వచ్చాడు. ఇక సుజాత మారాము పెట్టే టప్పటికి తప్పనిసరి అయింది షాపుకు తీసుకురావటం. పౌడరు డబ్బాలు, స్నో సీసాలు, రకరకాల సువాసనగల నూనె సీసాలు చూసేటప్పటికి వసంతకే భర్తను అడుగుదామనిపించింది. అయితే యేమంటారో అనే జంకుతో వసంత వాటన్నింటిని చూస్తూనే లోపల కోర్కెల్ని లోపలే అణిచేసుకుంది. అయితే సుజాత మాత్రం వచ్చీరాని మాటలతో, తల్లి అడగదలచుకున్నవేమిటో అడిగిగేసింది. పసిపిల్ల అడిగిందికదా అని పట్టు బలవంతాన ఒక చవకరకపు రిబ్బను యిచ్చేశాడు సూరిబాబు, మిగతా వాటికి తలోకవంకా చెపుతూను. వసంత వూరుకోలేక, పసిపిల్ల అది అడిగినందుకేనా ఇవ్వచ్చు గదండీ అని అంటే, యీ సరుకంతా లోకుల సొమ్ము, మనదనుకున్నావా యేమిటి అని సమాధానం యిచ్చాడు.

షాపులో తిరుగుతున్నంతసేపు, మధుకు యెన్నో అడగాలనిపించినా, చెల్లెలికి యిచ్చిన సమాధానము తనకుకూడా యిచ్చినట్లే అని భావించి మెదలకుండా వూరుకున్నాడు.

లెక్కగా యింట్లోకి కావలసిన వస్తువులు వేసుకుని సూరిబాబు సంచిలో ఇంటికి తీసుకు వెళ్లాడు. వసంతకు ఆనాడల్లా నెమలి కంఠం రంగు చీరెమీదే వుంది మనసంతా. ముష్టి పౌడరు డబ్బా యే యివ్వలేదు పసిపిల్ల అడిగినా, అలాంటిది ఖరీదుగల చీరె కొనుక్కోవాలని యెన్నాళ్ల పట్టో అనుకుంటునట్టుకూడా, ఏకాంతంగా సూరిబాబు లొంగిపోయే సమయంలో చెప్పినాకూడా ప్రయోజనం లేకపోయింది. దానికి యెన్నో వంకలు వచ్చినాయి. తన జీవితంలో ఒకే ఒక కోర్కెకు కూడా, సూరిబాబు విలువకట్టలేకపోయాడే అని వసంత యెంతో ఖేదపడింది. సుజాత రాత్రిల్లా అద్దాలు, స్నో సీసాలు, పౌడరు డబ్బాలు యింకా యేవేమిటో అంటూనే వుంది. మధు గట్టిగా యేమీ అనలేకపోయినా, తన మనస్సులో కోర్కెల్ని, తండ్రికి సమయం చూచి అప్పటికే చెప్పేశాడు. అయితే, మధు స్కూలు ఫైనల్ పరీక్ష ప్యాసవటానికీ, టేబుల్ ఫాన్ తెచ్చుకోటానికి లంకెపెట్టేటప్పటికి, జరగాలిసిన యేళ్ళ గురించి మధు ఎంతో దిగులుగా ఆలోచించుకున్నాడు. భార్య కోరికకుగాని, పిల్లల మురిపాలకుగాని లొంగని సూరిబాబు, బావమరిది విషయంలో తల్లి చెప్పినట్లు చేస్తాడని నమ్మలేకపోయినా, శాంతమ్మ వూరుకోలేక, ఎవ్వార్ సిల్వార్ ప్లేటు, టీ సెట్టు యివ్వమని బ్రతిమాలి అడిగింది. బావమరిది స్వతహాగా మోజుపడి, నోరుచేసుకుని అడిగినా లాభం లేకపోయింది. అప్పటికీ 'యింటికి వెళ్లగానే డబ్బు పంపిస్తాను లేవోయ్' అన్న బావమరిదికి కూడా, అప్పు పెట్టటం లేదనే సమాధానం వచ్చేటప్పటికి, బావమరిదికి చెడ్డ అసహ్యం కోపం వచ్చింది. తనను గురించి హేయంగా

అనుకుని పోతారేమోనని, "అప్పు యివ్వటం మొదలుపెడితే, నా వ్యాపారానికి తిరుగు మొహం పెట్టినట్టేనని అనుకున్నాను. లేకపోతే ఇవ్వటానికేమిటి" అంటూ ఇంట్లో చెల్లెలు ముందర అన్నాడు సూరిబాబు. "ఈ కాస్త భాగ్యానికి మాట వెలితిపడ్డావేగాని, అంతకంటే యేంలేదు" అని చెల్లెలు అన్నా, అలా నిష్ఠుర వాక్యాలు వ్యాపారం చేసేవాళ్ళు తెల్లారిలేస్తే వినటం సహజమే అన్నట్లు సూరిబాబు వూరుకున్నాడు. నట్టింట ఆడపిల్ల రాకపోవడానికి నువ్వు ఆనాడు మీ బావ అడిగినది యివ్వక పోవటమే కారణము అని తల్లి బాధిస్తున్నా ఏకోశానా లెక్కచెయ్యనేలేదు సూరిబాబు.

రానురాను సూరిబాబు యింట్లో వాళ్ళను "మీకేమమ్మ, మీరేమీ కొనుక్కోనక్కరలేదు. అంతపెద్ద షాపుంది. ఏది కావాలంటే అది తెచ్చుకోవచ్చు" అని అంటుంటే, వసంతకు పట్టరాని దుఃఖమే వచ్చింది. పిల్లలకు చెడ్డ వుక్రోషం వచ్చింది. దెబ్బతిన్న అభిమానాన్ని చేతపుచ్చుకుని, భర్త దగ్గరకు వెళ్ళితే, "మిఠాయి దుకాణంవాళ్లు మిఠాయి తింటారనుకున్నావా? ఏ వృత్తివాళ్ళు ఆ వృత్తిలో జాగ్రత్తగానే ఉంటారు. అలా వుండాలి కూడా. ఎవరో ఏదో అంటున్నారని మనం ఇవాళనుంచీ ఒక వస్తువు తెచ్చుకోవటం మొదలు పెట్టామంటే, అదే అలవాటై, అవసరానికి అనవసరానికి, సరిహద్దంటూ ఏమీ లేకుండా పోతుంది. చివరకు మన షాపుకే ముప్పువస్తుంది" అని, వ్యాపార సరళిలో నచ్చజెప్పటానికి సూరిబాబు ప్రయత్నం చేశాడు. తనకు నచ్చని సమాధానమైనా దిగమింగుకుని, నిజమే అన్నట్టు, భర్తను తృప్తి పరుద్దామనే తాపత్రయంలో తలవూపి వసంత వెళ్ళిపోయింది.

ఎంతవుంటేం అనుభవించే గీత వుండద్దా అని అల్లుడు నోట్లో శని అనే సామెత మాదిరిగా వుందని, రామరాను పీనాసి అనేమాటకూడా

తన చెవిన వేసుకుని కూడా యింట్లోనూ, బైటకూడా నోరెత్తి యేమీ అనటంలేదు సూరిబాబు. ఇంకా యెన్నో రకాల సామాన్లు తెచ్చి షాపు యెంతో అలంకారంచేసి వుంచేశాడు. ఈ షాపు పేరుబడిపోవటంతో ఆ చుట్టు ప్రక్కలవున్న రెండు చిన్న షాపులు యెత్తేసుకోవలసి వచ్చింది కూడాను. ఇంత యిదయినా సూరిబాబు ప్రవర్తనలో, యింట్లో వాళ్లుగాని, బైట స్నేహితులుగాని సంతోషించే మార్పేమీలేదు. నూటికి నూరుపాళ్ళు వ్యాపారమనే వలయంలో చుట్టుకు పోయాడు. ఎంత సేపటికి యింకా డబ్బు సంపాదించాలనేదే సూరిబాబు దృష్టి. ఆ యింకాకు మితం యెక్కడో అర్ధంకాదు.

మధ్యాహ్నం మధుతెచ్చిన అన్నం కాస్త తినేసి సూరిబాబు వాలు కుర్చీలో వత్తిగిలాడు. ఇట్టే కునుకు వచ్చేసింది. తమాయించుకుని లేచి కూర్చున్నాడు. ఎండ కొంచెం తీవ్రంగా వుందో ఏమో, షాపుకు యెవ్వరూ రాలేదు. టేబుల్‌మీద యేదో పుస్తకంవుంటే పేజీలు తిరగేస్తున్నాడు. ఆ పుటల్లోకి చూస్తుంటే తన గత చరిత్ర చప్పున జ్ఞాపకం వచ్చింది. తాను హైస్కూలులో చదివే రోజులు. మునిసిపల్ హైస్కూల్, తాను చదువు యెప్పటికప్పుడు యెట్లా దాటేస్తూ వచ్చిందీ. మాస్టర్లను మోసగించి క్లాసులో పాఠాలు ఎగేసిందీ, రంగనాధంగారు క్లాసులో పాఠాలు యెట్లా చెప్పేది, కొండలరావు గారి లెక్కల పీరియడ్, రామారావుగారి ఇంగ్లీషు పీరియడ్, యింకా యేవేమిటో దొర్లుకుంటూ వస్తున్నాయి తన స్మృతి పథంలోకి. రామారావు బాబాయి చప్పున జ్ఞాపకానికి వచ్చారు. ఆయనే కనక యింకా కొన్నాళ్లు బ్రతికే వుంటే నాకు చదువు వచ్చి వుండేదే అనుకున్నాడు. నా చదువుదాకా యెందుకు, ఆయనే కనక యింకా బ్రతికేవుంటే, మన బంధువుల్లోనే చాలామంది జీవితాలు యీ విధంగా కాక, యింకే రకంగా

పరిణమించేవో అని అనుకున్నాడు. ఆయన బంధు ప్రేమకు పాత్రులు కాని, తన బంధువర్గంలో వాళ్లను దూషించుకుంటున్నాడు. ఆయన విశాల హృదయంగాని, నిష్కల్మషమైన మనస్సుగాని, తాను ఎరుగున్నంతలో ఇంకెవ్వరికీ కూడా లేదనుకున్నాడు. ఆయన్ను గురించే యింకా మనస్సు పనిచేస్తూ వుంది. చటుక్కున క్లబ్బులో ఆయన అన్న మాటలు జ్ఞాపకానికి వచ్చినాయి. అప్పట్లో ఆయన అన్నదానికి అర్థం తెలియలేదు. తెలిసినట్లు తల వూపి, తాను మైనరును కాదని నిరూపించుకున్నాడు. 'జీవితం ఒక ప్రవాహం వంటిది. ఏమీ అడ్డం లేకండా సాఫీగా ప్రవహిస్తూ, నదిలోకలిసి చివరకు సముద్రంలో కలిసి పోతుంది. కాక ఎక్కడైనా యేదో రాయొ, మెరకో అడ్డం వచ్చిందంటే, దాని గమనం తీరే మారి పోతుంది. అట్లాగే జీవితానికి కూడా. దాని నడకలో ఎక్కడో యెప్పుడో యేదో అడ్డం వస్తుంది. దాంతో జీవితమే పెద్ద మార్పు పొందుతుంది. ఆయన అన్న మాటలు లీలగా అర్థమవుతూవచ్చాయి. తన జీవితంలో షాపు పెట్టటమే ఓ గొప్ప మార్పును తీసుకు వచ్చింది. ఈ షాపు పెట్టటమే కనక లేకపోతే నా జీవితం ఎట్లా వెళ్ళిపోయేదో యేమిటో; ఇదొక నూత్న అనుభవం. అందువల్లనే యీ జీవిత గమనంలో యేనాడు యెలాంటి మార్పు వస్తుందో తెలీదుగదా అని ఆలోచించుకుంటూ సూరిబాబు, రామారావుగారు అన్న మాటల్ని స్మరించుకుంటున్నాడు. అంతా అతనికి ఆశ్చర్యంగా తోస్తోంది. తన ఆలోచనా ప్రవాహం చప్పున కట్టుబడింది. ఎవరో అమ్మాయివచ్చి పాండ్స్ స్నో యివ్వమనేటప్పటికి.

అయిదింటికి కూడా యింకా బాగా ప్రొద్దు వుంటూనే వుంది. చలికాస్త కొండల వెనకబడిపోయింది. రాత్రి తొమ్మిదీ, తొమ్మిదిన్నర దాకా షాపునిండా జనం కిటకిటలాడుతూనే వుంటున్నారు. అమ్మకానికవి

పెట్టిన యిద్దరు కుర్రాళ్ళు బేరాలు చెప్పటంలోను, మనుష్యులను రాబట్ట టంలోను ఆరితేరారని సూరిబాబు కూడా సంతోషిస్తూనే వున్నాడు. షాపుకు రకరకాల వాళ్లు వస్తున్నారు. కొంటరు ముందర కూర్చుని బిల్లునుపట్టి డబ్బు వసూలు చేసుకునే పని తీసుకున్నాడు. బజార్లో వెంబడి వెళుతూ వస్తూవుంటే మనుష్యులందర్నీ కూడా తన షాపుకు వస్తున్నా రేమోననీ ఆదుర్దాగా వాళ్ల మొహాలవైపు చూడటం సూరిబాబు బాగా అల వాటు చేసుకున్నాడు. మొదట్లో తొమ్మిదిన్నరకు తన షాపుకు ఎదురుగా బజార్లోంచి ఓ అమ్మాయి సంచీ పట్టుకుని వెళుతుంటే తన షాపుకు వస్తోందేమోనని ఆ అమ్మాయి కూడా కళ్ళు షాపు వైపుకు ఎత్తి, సూరి బాబును పూరించింది. రెండో తడవ ఆ అమ్మాయి మొహంలోకి చూసేటప్పటికి యీ అమ్మాయి యీ టైముకు యెప్పుడూ వెళుతూనే వుంటుందిలే అని అనుకున్నాడు. సాయంత్రం అయిదున్నరకు మళ్ళీ ఆ పరిచితమైన మొహమే కనిపించేటప్పటికి, యీ అమ్మాయి కొనేరకం కాదనుకున్నాడు. నిర్ణీతమైన టైములో ప్రొద్దున, సాయంత్రం అదే పనిగా సూరిబాబు కళ్ళల్లోకి ఆ అమ్మాయి. నిత్యం వస్తూనే వుంది, మనిషి లేతగులాబి రంగు, అప్పుడే విచ్చిన మల్లెమొగ్గ వయస్సు. ఆరింటికి ఏటవాలుగా పడుతున్న సూర్యకిరణం, ఆ అమ్మాయి కంఠంలో వేసుకున్న ముత్యాలహారం మీదపడి, సూరిబాబు కళ్ళు చెదిరిపోయేటట్టు చేసింది. కళ్ళు చప్పున మూసుకుని, వెంటనే తెరిచాడు. ఆ అమ్మాయి చంగున చంగున వెళ్ళిపోతుంది. సూరిబాబు కళ్ళు ఆ అమ్మాయివెంట పరుగెత్తుతున్నాయి. వెంటనే ఓ బిల్లువచ్చి, టేబుల్‌మీదపడి సూరిబాబు దృష్టికి అడ్డంగా నిలిచింది. సూరిబాబు వ్యాపార దృక్పథంతో చిరు నవ్వు మొహంపెట్టి, డబ్బు తీసుకున్నాడు. ఆ వ్యక్తి నవ్వు, సూరి బాబుకు కటువుగానే వుంది. అప్పుడప్పుడా అమ్మాయి, సూరిబాబు మొహంలోకి చూస్తున్నా, సూరిబాబు నిత్యమూ రెండుసార్లు, ఆ అమ్మాయి

కళ్లలోకి చూస్తూనే వున్నాడు. ఆ అమ్మాయి, మన షాపుకువస్తే బాగుం డుననే వుద్దేశం, వ్యాపార దృక్పథంతో కలగలేదు సూరిబాబుకు. ఎంతో పరిచితమైన వ్యక్తిగా భావిస్తున్న సూరిబాబుకు, ఆ అమ్మాయితో కనీసం మాట్లాడనైనా మాట్లాడకపోతే, మనస్సు శాంతిచేటట్టు కనిపించటంలేదు.

ఆ అమ్మాయి అనుకోకుండా షాపులోకి నీటుగా వచ్చేసింది సూరి బాబువంక చూడకండానే. సిగ్గేమోనని సద్దుకున్నాడు. ఇలాంటి పరిస్థి తులో యింకోళ్ళయితే దెబ్బతిన్న అభిమానంతో త్రాచులాగ పైకిలేచే పరిస్థితే! ఏవో రెండు సరుకులుకొని బిల్లు డబ్బు టేబుల్‌మీద పెట్టింది. సూరిబాబు గుండె దడదడ కొట్టుకోవటం మొదలు పెట్టింది. చప్పున లేచి నుంచున్నాడు. మొహాన రుమాలుతో గట్టిగా తుడుచుకుని, 'చిల్లర లేదు పోనీ తర్వాత యివ్వండి' అని అయిదు రూపాయలనోటు మళ్ళీ ఆ అమ్మాయి చేతికి అందించబోయాడు. ఆ అమ్మాయి చిరునవ్వు నవ్వింది. సూరిబాబు తేలిపోయాడు. నవ్వుకుంటూ ఆ అమ్మాయి అయిదు రూపాయలనోటు తీసుకుని వెళ్లిపోయింది. సూరిబాబు ఆనందం పట్టలేక పోయాడు. ఇంకోసారి వచ్చినప్పుడు ఆ అమ్మాయి అతి చొరవగా వస్తువులు తీసుకుని, సూరిబాబు మొహాన బిల్లుతోపాటు ఓ నవ్వును కూడా పారేసి, చకచక వెళ్ళిపోయింది.

ఫస్టు తారీఖు వచ్చేటప్పటికి జమా ఖర్చులు తయారు కాలేదు. లెక్కలు అన్నీ గజిబిజిగా వుండిపోయినాయి. లాభం ఎంత వచ్చిందో, ఎవరెవరికి ఎంత యివ్వాలో తేలటంలేదు. సూరిబాబు మనస్సు కూడా చెడ్డ చిరాకుగావుంది. "ఇవ్వాళ సాయంత్రం పెందరాళే వచ్చేశారు. దుర్గ గుడికి వెళ్ళరాలేదేమిటి" అని వసంత అడుగుతే, ప్రతిదానికి ఆరా తీసి అడుగుతోవుంటావని కస్సుమన్నాడు సూరిబాబు. జోరున వర్షం కురుస్తుంటేకూడా గొడుగేసుకుని రాత్రి పదింటికి వెళుతుంటే వసంత

గట్టిగా పట్టుపట్టి ఆపుదామనుకుంటే వీలులేకపోయింది. వసంత అనుమానాలు రోజు రోజుకు సూరిబాబు ప్రవర్తనకి దృఢపడి పోతున్నాయి.

ఆ అమ్మాయికి పూర్తిగా సూరిబాబు దగ్గర చనువు ఏర్పడటానికి ఎక్కువ కాలం పట్టలేదు. "శశిరేఖ పేరు బాగాలేదు. రేఖా అని పిలుస్తాను ఎంతో బాగుంటుం"దంటే, ఆ అమ్మాయి సూరిబాబు మురిపానికి అభ్యంతరం చెప్పలేదు. సుజాత మంకుపట్టుపట్టి, నాన్నా నాకు ఇవ్వవు అని మారాము చేసిన ఒక స్నో డబ్బాయేకాదు, అలాంటివి ఎన్నో శశిరేఖకు వెళ్ళిపోయినాయి. ఆ అమ్మాయికి ఇచ్చిన వస్తువులన్నీ లెక్కచూసుకుని, చివరకు లాభంలో కొంత తగ్గిందనుకుంటాలే అని సూరిబాబు తృప్తిపడుతున్నాడు. సూరిబాబుకు డబ్బు విలువతోపాటు, మనిషి విలువకూడా తెలియటంలేదు. ఉన్న సరుకు అమ్ముకుంటేచాలు యెంతైనా లాభం వస్తుందనే సిద్ధాంతంలో క్రొత్త వస్తువులేమీ తెప్పించకపోవటంతో, వచ్చిన వాళ్ళకు చాలావరకు లేవు అనే చెప్పాలసి వస్తోంది. నాలుగు వస్తువులు లేవు అనేటప్పటికి, ఉన్న అయిదో వస్తువు కోసం యెవరూకూడా రావటంలేదు. బేరం సన్నగిలేటప్పటికి గుమాస్తాల బరువు యెక్కువయింది.

రేఖ సూరిబాబుకే కాదు అందరికీ కూడా ఎంతో అందంగా కనిపిస్తుంది. తన సర్వస్వము యివ్వటానికి సిద్ధపడ్డ సూరిబాబుకు, ఆ అమ్మాయి పూర్తిగా లొంగిపోయిందంటే ఆశ్చర్యంలేదు. ఆ రోజుల్లో సూరిబాబుకు అంతా రేఖమయంగా వుండేది. ఎన్ని అడిగినా ఏమీ అడ్డు చెప్పకండా రేఖకు యిస్తూపోతూ వుండేవాడేకాని, ఆ నెమలి కంఠం రంగు చీరె రేఖ యివ్వమన్నప్పుడు సూరిబాబు కొంచెంగా తటపటాయించిన మాటవుతే వాస్తవమే; వసంత ముద్దుగా అడిగినప్పుడు, ఖచ్చితంగా వీల్లేదన్న సూరిబాబు మనస్సు తర్వాత తీవ్రంగా పనిచేసి, ఆ చీరె తన

భార్య పుట్టినరోజు పండగనాడు తనంతట తాను తీసుకువెళ్ళి ఇచ్చి, వసంతకు, తనమీద వున్న అభిప్రాయాలన్నింటిని పటా పంచలు చెయ్యాలీ అనే వుద్దేశంతో ఆ చీరె మాత్రం విడిగా పెట్టి వుంచాడు. సూరిబాబు మీదే సర్వ హక్కులు సంపాదించుకున్న రేఖకు ఆ షాపులో వెదకని చోటంటూ వుండదుకదా! ఆ అమ్మాయి కళ్లు కూడా ఆ చీరెమీద పడటంతో సూరిబాబు మనస్సు చివుక్కుమంది క్షణకాలం. అయితే ఆ చీరె రంగు రేఖ వంటికి ఎంతో అందం ఇస్తుందని సూరిబాబు వప్పుకున్నాడు. తర్వాత రెండు మూడుసార్లు అడిగినాకూడా రేఖ ఏదో సమాధానం ఇచ్చేసి మాట తప్పించిందన్న మాటేగాని, తాను నెమలి కంఠం రంగు చీరె కట్టుకు రాకపోవటానికి తగిన కారణాలేవీ చెప్పలేదు. ఆ చీరె రంగులో రేఖ యెట్లా మెరుస్తుందా చూద్దామన్నా సూరిబాబు ఆకాంక్షకు మోక్షం వచ్చే ఉపాయం కనిపించటంలేదు. పిచ్చివాడు లాగ రేఖ చుట్టూ తిరుగుతూ చీరె విషయం యెన్నోసార్లు అడుగుతూ వచ్చాడు.

తాను పకపకా నవ్వుతూ, సూరిబాబు బుజంమీద చెయివేస్తే, సూరిబాబు ఏమవుతాడో రేఖకు బాగాతెలుసు. ఈ అస్త్రాన్ని వుపయోగించాలసిన అవసరం యెప్పుడు కలిగినా ఆ అమ్మాయి వెనుదీయలేదు. సూరిబాబు ఆరోగ్యం చెడిపోవటానికి ప్రత్యేకంగా కారణాలేవంటూ వసంత వూహించలేక పోతోంది. తాను పడుతున్న అనుమానాల్ని ధైర్యంచేసి భర్త దగ్గర అనే తాహతే లేకపోతే పరాయివాళ్ళతో యే మొహం పెట్టుకొని చెపుతుంది కనక!

సూరిబాబు షాపు ఫలానా గంటకుగాని, ఫలానా రోజుకుగాని తెరుస్తారు అనేఅంచనా ఎవరూకూడా వేసుకునే ఆసరాలేకండా పోయింది. సూరిబాబు చిత్త ప్రవృత్తి నిబట్టి షాపు తెరుస్తూవుంటాడు. రెండు మూడు రోజులు వరసగా రేఖ కనిపించక పోయేటప్పటికి, సూరిబాబుకు మతి చెడినట్లనిపించింది. షాపులో చాలావరకు సరుకంతా అయిపోయింది. నాలుగు అలమారలు, రెండు బీరువాలు, అయిదు కుర్చీలు, యింకా

కొద్దిగా సరుకు తప్ప యింకా యేమీలేవూ షాపులో. షాపుకు కట్టవలసిన అద్దె భారం యెక్కువయి పోయింది. రోజు, రోజూ యజమానితో తగాదాపడే బదులు షాపు ఖాళీ చేసిపోతే బాగుంటుందని సూరిబాబు తీవ్రంగా ఆలోచించుకుంటున్నాడు. అప్పటికి రేఖ కనిపించి వారం దాటిపోతోంది. రేఖను గురించి ఇంకో విధంగా ఆలోచించటానికి సూరిబాబు మనస్సు వప్పటంలేదు. ఏదో అనుకోకుండా హఠాత్తుగా పనితగిలి వుండాలి. అందువలనే రేఖ యీ జాడలకు కూడా రావటం లేదు అని అనుకుంటూ తృప్తి పడుతున్నాడు. రేఖ ఫోటోవంకే చూస్తూ యెంతసేపు కూర్చున్నా, తనివి తీరటంలేదు. ఇంట్లో భార్య, పిల్లల పోరు పడలేక, "వ్యాపారంలో పెద్ద నష్టం వచ్చింది అందువలన షాపు యెత్తయ్యవలసి వచ్చింది" అన్నాడు సూరిబాబు. తల్లి అడిగిన యేదో ప్రశ్నకు వికటంగా సమాధానంచెప్పి మీదకు వచ్చాడు కొట్టరావటానికి. మెల్లిగా బావిదగ్గరకు వెళ్ళి మొహం కడుక్కుని, వంటిట్లోకి వచ్చాడు కాఫీ అయిందా అంటూ. "ఓ మూల చేతులో పనిచూస్తుండి కూడ కాఫీ, కాఫీ అంటూ అరుస్తారే" అన్నది వసంత. మొహం మట మట లాడించుకుంటూ. విసుగ్గా తిట్టుకుంటూ వాకిట్లోకి వెళ్ళిపోయాడు సూరిబాబు. ఇవ్వాళిటితో షాపు యెత్తెయ్యాలని అనుకుంటూ గబగబ రిక్షామీద గవర్నరుపేట వచ్చేశాడు.

చల్లటిగాలి మెల్లగా వీస్తోంది. ప్రక్కన పూల దుకాణాల్లోంచి వస్తున్న ఘుమ ఘుమలు, నాసికారంధ్రాల్లోకిపోయి హృదయాన్ని గిలిగింతలు పెట్టేస్తోంది. రోడ్డునిండా జనం, కులాసాగా కబుర్లు చెప్పుకుంటూ పోతున్నారు. పార్కులోంచి రేడియో సంగీతం కమ్మగా వినిపిస్తోంది. సూరిబాబు బరువుగా షాపులో కూర్చున్నాడు. అయిదున్నర అవబోతుండగా ఎందుకనో తన కళ్ళు రోడ్డుమీద పోతున్న జనంమీద పడ్డాయి. అప్పటికే రేఖ కనిపించి, చాలా రోజులయింది. అందువలన

అనిర్ణీతమైన టైముకు అక్కడకు వస్తుందంటే సూరిబాబుకు నమ్మకం కుదర్లేదు. అయినా అలవాటు చొప్పున సూరిబాబు అటు చూస్తూనే వున్నాడు. అప్పటికే బీరువాలు బండిమీద ఎక్కించటం అయిపోయింది. తన వస్తువు అనేది యేది లేకుండా షాపు ఖాళీ చేసేశాడు. ఒకసారి నాలుగు మూలల కలయచూసి తలుపులు రెండూలాగి తాళం వేసేశాడు. ఒక్కసారి పెద్ద నిట్టూర్పు విడిచి ఆ షాపువంక చూసి బయటకు వచ్చేశాడు. బళ్ళవుతే ముందర పోతున్నాయి. తాను వెనకాలే నడుస్తున్నాడు. నాలుగడుగులు వేశాడో లేదో, సూరిబాబు కళ్లు చెదిరిపోయినాయి. నెమలి కంఠం రంగు చీరె కొసలు గాలికి రెప రెప కొట్టుకుంటూ కనిపించాయి.

చప్పున తలెత్తి చూచాడు. రేఖ! రేఖే! శశిరేఖ! నిండు యవ్వనాన్ని నెమలి కంఠం రంగు చీరలో కప్పుకుంది. ఆమె శరీరపు లేత గులాబి రంగు, పైకి కనిపిస్తున్నంత వరకు తళ తళ మెరసిపోతోంది. వాలు జడంతా, మల్లె మొగ్గలు చుట్టేసుకున్నాయి. సూరిబాబు అలాగే నిలబడిపోయి ఆశ్చర్యంగా శశిరేఖవంక చూస్తూ రేఖా అనబోయాడు. రేఖ వయ్యారంగా, చంద్రం చేతిలో చెయ్యి వేసుకుని, సూరిబాబును చూసీచూడకండా వెళ్ళిపోయింది. సూరిబాబు రేఖ వైపుకు తిరిగాడు. రేఖ ఒక్కసారిగా తన శరీరాన్ని చూసుకుని, పమిటకొంగు గిరాగిరా త్రిప్పుకుంటూ, సూరిబాబు కళ్ళల్లోకి చూసి పక్కున నవ్వి, చంగు చంగున వెళ్ళిపోయింది, చంద్రంతో.

సూరిబాబుకు, హృదయచలనం ఆగిపోయినట్లనిపించింది.

వెర్రిగా షాపు తాళంవంకా, వెళ్ళిపోతున్న రేఖవంకా కళ్ళు త్రిప్పుకుంటూ, అలాగే నిలబడిపోయాడు, సూరిబాబు.

( ఆంధ్ర సచిత్ర వార పత్రిక, 12–2–1958 )